క్లుప్తంగా

పిచ్చిమొక్కల తొలగింపు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమాన్ని చేపట్టారు. కాలనీల్లో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలను తొలగించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. అధ్యక్షుడు గోసికొండ అశోక్, శివరాజ్, బి. కమలాకర్, సుంకె శ్రీనివాస్, కొక్కెర భూమన్న, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం



బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి)లో లక్ష్మీవేంకటేశ్వర ఆలయ 25వవార్షికోత్సవ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుణ్యాహవచనం, ధ్వజారోహణ, కలశ స్థాపన, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్‌లోని పలువురు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన సంగ చిన్నయ్య తండ్రి, ఏర్గట్ల మల్లేశ్ తల్లి ఇటీవల మరణించడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భగవద్గీత పోటీల్లో సత్తా..



బాల్కొండ: వరంగల్ జిల్లాలో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో మండల కేంద్రానికి చెందిన మదర్ థెరిసా హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని వినూహ్య సత్తా చాటింది. భగవద్గీత శ్లోకాలను ఆలపించి రాష్ట్ర స్థాయిలో నాల్గవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని వినూహ్యను నిర్వాహకులు, పాఠశాల కరస్పాండెంట్ రామలక్ష్మి, హెచ్‌ఎం నరసింహారెడ్డి ఆదివారం అభినందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ చేపట్టారు.

కలిగోట గంగాధర్‌కు సన్మానం



పెర్కిట్‌: ఆర్మూర్ మండలం అకాంపూర్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన కలిగోట గంగాధర్‌ను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బోధన్‌టౌన్‌: మండలంలో సోమవారం నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఆదివారం తెలిపారు. బోధన్ మండలంలోని 13 పరీక్షా కేంద్రాల్లో 2,962 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించినట్లు తెలిపారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: మండలంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి ఆదివారం తెలిపారు. విద్యార్థులకు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకొని పరీక్షలు రాయాలని సూచించారు. మండలంలో మొత్తం 634 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్మూర్‌కు ప్రత్యేక చరిత్ర

- పలువురు వైస్‌చైర్మన్‌లకు దక్కిన ఇన్‌చార్జి బాధ్యతలు
- జీపీ, మున్సిపాలిటీల్లో ముగ్గురు వైస్‌లకు దక్కిన అరుదైన అవకాశం



షేక్ మున్ను



ఉషారాణి



సంజయ్ సింగ్ బబ్లూ



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం

ఆర్మూర్‌: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా, అవిశ్వాస తీర్మానంతో వైస్‌చైర్మన్‌లకు ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌ల బాధ్యతలు దక్కిన చరిత్ర గురించి ఆర్మూర్‌లో ప్రత్యేకంగా చర్చ జరుగుతోంది. ఆర్మూర్ గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో ఇన్‌చార్జి సర్పంచ్, చైర్‌పర్సన్‌లుగా బాధ్యతలు నిర్వహించిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. 1956 నుంచి 1962 వరకు మున్సిపాలిటీగా ఉన్న ఆర్మూర్‌ను 1962లో జీపీగా మార్చారు. ఆర్మూర్ మేజర్ జీపీగా ఉన్న రోజుల్లో 2006లో సర్పంచ్‌గా ఉన్న కొంగి సదాశివ్ అయ్యప్ప దర్శనానికి శబరికి వెళ్లడంతో 2006 జనవరి 1 నుంచి పదిహేను రోజుల పాటు నాటి ఉపసర్పంచ్ సంజయ్ సింగ్ బబ్లూ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. తిరిగి ఆర్మూర్ జీపీని 2006లో మున్సిపల్‌గా మారుస్తూ 2008లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. అయితే 2008లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించగా త్రివేణి గంగాధర్, కంచెట్టి గంగాధర్ చెరి రెండున్నరేళ్ల కాలం అధికారాన్ని పంచుకున్నారు. దీంతో 2011లో త్రివేణి గంగాధర్ రాజీనామా చేయడంతో చైర్‌పర్సన్ పీఠం ఖాళీ అయింది. తిరిగి చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించే వరకు వైస్ చైర్‌పర్సన్ పింజ ఉషారాణికి వారం రోజుల పాటు ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. అనంతరం కంచెట్టి గంగాధర్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అదేవిధంగా ప్రస్తుతం పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో వైస్‌చైర్మన్‌గా ఉన్న షేక్ మున్నూకు ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఈ నెల 13న ఆయన ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఈ నెల 21న చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న వినయ్‌కుమార్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్‌: ప్రతి రోజు ధ్యానం చేస్తే మానసిక ఒత్తిడి దూరమవుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై ఉన్న పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండవ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగద్గురువు బ్రహ్మర్షి పితామహ సుభాష్‌పత్రీజీ మార్గదర్శకంలో ప్రతిఒక్కరూ నవడాలన్నారు. ధ్యాన మందిరానికి నియోజకవర్గ నిధుల నుంచి రూ. పదిలక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. పత్రీజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఎస్‌ఎస్‌ఎం సభ్యులు గంగారెడ్డి, సాయికృష్ణారెడ్డి, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సాయిబాబాగౌడ్, జిమ్మి రవి, ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల



ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, తాళ్ల శ్రీనివాస్ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 18, 19, 20న నామినేషన్లను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 21న స్క్రూటినీ, 22న నామినేషన్ల ఉపసంహరణ, సాయంత్రం 5గంటలకు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 28న ఎన్నికల పోలింగ్, సాయంత్రం ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, బొట్ల జీవన్, జక్కుల శ్రీధర్, శ్రీనివాస్, విశ్వనాథ్, చరణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



మెండోరాలో పటాకులు కాలుస్తున్న నాయకులు



రుద్రూర్‌లో..

బాల్కొండ/ రుద్రూర్/ కోటగిరి/ వేల్పూర్: జిల్లాలోని పలుగ్రామాల్లో కాంగ్రెస్ కీలక నేతలకు ఉన్నత పదవులు దక్కడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివా రం సంబురాలు చేపట్టారు. ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్‌కు మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి నియామకం కావడంతో బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో, మెండోరా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షులు వెంకటేశ్, ముత్యంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లోని బస్టాండ్ ఎదుట కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేపట్టారు. టీపీసీసీ సభ్యుడు, బాన్సువాడ నియోజక వర్గ ఇన్‌చార్జి కాసుల బాలరాజ్‌ను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేసి పటాకులు కాల్చారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులు నడిపింటి నగేశ్, పార్వతి ప్రవీణ్, నిస్సార్, కుర్మాజీ సాయిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరిలో కాంగ్రెస్ బాన్సువాడ సీనియర్ నేత కాసుల బాలరాజ్‌ను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో పార్టీ నాయకులు సంబురాలు చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు షాహీద్, ఎంపీటీసీ కొట్టం మనోహర్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రావు, నాయుడు వేణు, గణేశ్, హైమద్, అబ్బయ్య, కూచి శ్రీనివాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ నియోజవర్గ కాంగ్రెస్ నాయకులు ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, సుంకెట అన్వేష్‌రెడ్డికి రాష్ట్రస్థాయి పదవులు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ వేల్పూర్ మండల నాయకులు ఆదివారం పటాకులు కాల్చి సంబురాలు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, రాజేందర్, రమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో..



వేల్పూర్‌లో పటాకులు కాలుస్తున్న నాయకులు

దుక్కి దున్నితే ఎన్నో లాభాలు



ముప్కాల్‌లో ట్రాక్టర్‌తో లోతు దుక్కి చేస్తున్న రైతు

బాల్కొండ: వేసవికి ముందు పంట భూముల్లో లోతు దుక్కి చేస్తే అనేక లాభాలున్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు ఇప్పటి నుంచే రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. ప్రధానంగా పసుపు పంట సాగుకు రైతులు దుక్కిలు దున్ని, ఎరువులు వేస్తున్నారు. వేసవికి ముందు పంట భూముల్లో లోతు దుక్కి చేస్తే భూమి లోపల పంటకు హాని కలిగించే నిద్రావస్థలో ఉన్న క్రిమి కీటకాలు బయటకు వచ్చి ఎండకు చనిపోతాయి. అంతే కాకుండా పక్షులు ఆహారంగా తీసుకుని క్రిమి కీటకాలను ఏరివేస్తాయి. లార్వ దశలోని పురుగులు చనిపోతాయి. భూమి లోపలి నుంచి దుక్కి దున్నితో భూమి లోపల ఉండి పోయిన సారవంతమైన మట్టి పైకి వచ్చి సమాంతరంగా మారుతుంది. దుక్కి లోతుగా ఉంటే వర్షం కురిసినప్పుడు నీరు ఎక్కువగా నిలిచి పంట భూమిలో తేమ శాతం పెరుగుతంది. దుంప పంటలు సాగు చేసే భూమిలో లోతు దుక్కి వేయడం చాలా అవసరం. లోతు దుక్కి వలన భూమి వదులుగా మారుతుంది. దీంతో దుంప పెరుగుదలకు మంచి అవకాశంగా ఉంటుంది. లోతు దుక్కి వేయించడం వలన భూమిలోపల ఉండే గడ్డి విత్తనాలు పైకి వచ్చి సూర్యరశ్మికి ఎండిపోతాయి. దీంతో కలుపు సమస్య లేకుండా పోతుంది. పంట భూముల్లో సాగు చేసిన పంట మిగులు భూమిలోపల కలిసి పోవడం వలన సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. లోతు దుక్కిని నీరు పెట్టిన తరువాత వేయించాలి. నీరు పెట్టడం వలన భూమిలో ఉన్న గడ్డి విత్తనాలు మొలకెత్తుతాయి. దీంతో సగం కలుపు నివారణ జరుగుతుంది. పసుపు పంటను సాగు చేసేందుకు తప్పనిసరిగా లోతు దుక్కి చేపట్టాలని మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి సూచిస్తున్నారు.

కమిటీలను ఏర్పాటు చేయాలి



బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎంఈవో రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల భవనంలో హెచ్‌ఎంలతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి వారి పేరున అకౌంట్స్‌ను తీయాలన్నారు. పాఠశాలలో కావాల్సిన మౌలిక సదుపాయాలను కమిటీ ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే బట్టలను స్థానిక మహిళా సమాఖ్య సంఘాల ద్వారా కుట్టించాలన్నారు. సమావేశంలో పీజీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష అట్టల పంపిణీ



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని బధిర పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, స్టేషనరీని ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉన్నత ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పట్వారి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు పుష్కర్ రావు, సభ్యులు గోనె దామోదర్, రాస ఆనంద్, వినాయక్, పాఠశాల ఇన్‌చార్జి మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన రేకుల షెడ్డు



ఎడపల్లి: మండలంలోని ఠానాకలాన్‌కు చెందిన ఆటోడ్రైవర్ లక్ష్మణ్‌కు చెందిన రేకుల షెడ్డు శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కూలిపోయింది. తమను ప్రభుత్వం ఆదుకొని ఆర్థికసాయం అందించాలని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వానొస్తే నీటికుంటే..



బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో పాత జాతీయ రహదారి, కిసాన్‌నగర్ నుంచి నాగాపూర్ వెళ్లే రోడ్డుపై చిన్నపాటి వర్షానికి నీరు నిలుస్తోంది. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రారంభమైన ఆలయ ఉత్సవాలు



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పెర్కిట్‌: మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో శివపంచాయతన సహిత హనుమాన్ దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమాన్ విగ్రహాలతో గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ఈ నెల 20న హంపి విరూపక్ష విద్యారణ్య స్వామిజీ వేద మంత్రాల మధ్య ఆలయంలో శివపంచాయతన, హనుమాన్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజ శిఖరాలను ఆలయంలో ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తానా

పెర్కిట్‌: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తానా అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎంజే ఆస్పత్రిలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మహిళలకు ఉచిత కుటుంబ నియంత్రణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రతి రంగంలో ముందడుగు వేస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. అనంతరం ఆస్పత్రిలో నిర్వహించిన శిబిరాన్ని పరిశీలించారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు మధుశేఖర్ మాట్లాడుతూ.. ప్రముఖ మహిళా వైద్యులు శిబిరంలో పాల్గొని సహాయ సహకారాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సంస్థ సభ్యులు మహిళలు, మహిళా వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మానాలకు సన్మానం



మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్మూర్ నాయకులు



మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ డెలిగెట్

ఆర్మూర్/ బాల్కొండ/ వేల్పూర్: కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. వారి వెంట పార్టీ నందిపేట్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, లిఫ్ట్ చైర్మన్ భోజారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇంద్రుడు, వెల్మల్ గోపి, రాజేందర్, లక్ష్మీనారాయణ, మదన్‌పల్లి ఎంపీటీసీ సభ్యులు ఒడ్డెన్న, భూపేందర్, నటరాజ్, సిద్దుల గుట్ట ఆలయ సభ్యుడు శ్రీనివాస్, ప్రసాద్, శ్యామ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి కో–ఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడంతో ఆయనను డీసీసీ డెలిగేట్ జైడి రవి కుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు రాజుకుమార్, కిసాన్ ఖేత్ ముప్కాల్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రాజ్‌వెంకట్, నరేశ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర కో–ఆపరేటివ్ చైర్మన్‌గా నియామకమైన డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ వేల్పూర్ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలను జమ చేయాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం సభ్యులు

పెర్కిట్‌: ప్రభుత్వం ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆర్మూర్, ఆలూర్ మండల కేంద్రాల్లో ఆదివారం టీపీయూఎస్ సంఘం సభ్యులు సమావేశమై ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. మార్చి 31లోపు ఉపాధ్యాయుల పీఆర్‌సీ, జీపీఎఫ్‌లను ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా జన జాగరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. పాపగారి రామకృష్ణారెడ్డి, నల్ల కిషన్ రెడ్డి, శివాజీ, రుద్ర మధుసూదన్, రుద్ర రజిత, వెంకటరమణ, రవి, గజేందర్, స్మృతిమ పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరిన వారితో మండల అధ్యక్షుడు గంగాధర్

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు కె. గంగాధర్, యువమోర్చ అధ్యక్షుడు గంగోల్ల ప్రళయ్‌తేజ్, ఓబీసీ మండల అధ్యక్షుడు మల్లయ్య ఆధ్వర్యంలో బీజేపీలో ఆదివారం చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బూత్‌కమిటీల నియామకం

కల్లెడి గ్రామ బీజేపీ బూత్ కమిటీని పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించి ఎన్నుకున్నారు. బూత్ కమిటీ అధ్యక్షులుగా మీరా అనిల్, బి మధు, శిరికొండ సాయికుమార్, పార్టీ గ్రామ ఇన్‌చార్జిగా అరుణ్ నియామకమయ్యారు. సలహాదారులుగా భూమయ్య, నరేందర్, డి రాజేశ్వర్, బి సాయినాథ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జిగా మోతె అశోక్, యువమోర్చా అధ్యక్షుడిగా మచ్చర్ల అర్జిత్, బీసీ సెల్ అధ్యక్షుడిగా దాసరి రాధాస్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా జె ఎల్లయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మాలోత్ మహేశ్, మైనార్టీ అధ్యక్షుడిగా షేక్ హైమద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సాయి చరణ్, శేఖర్, నవీన్, మధు, శ్రీకాంత్, నర్సయ్య, దినేశ్, శ్యామ్, వెంకటేశ్, రాజశేఖర్, గంగాప్రసాద్, సదానందం, రాందాస్ పాల్గొన్నారు.

మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రారంభం



వేల్పూర్: జాన్కంపేట్‌లో ప్రాథమిక మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాన్ని ఎంపీటీసీ సొడ చందన్, మాజీ సర్పంచ్ సొడ రమేశ్ ఆదివారం ప్రారంభించారు. పారిశ్రామిక సంఘాన్ని విజయవంతంగా నడిపి ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు మగ్గిడి శోభ, కార్యదర్శి భట్టు అంజమ్మ, గంగాకిషన్, బాలకిషన్, మహిళలు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	బులెట్ (తెలుగు) – 10.25 సైతాన్ (హిందీ) – 1.15, 7.00 బాబు (తెలుగు) – 4.15 ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) – 10.00
స్క్రీన్-2 –	గామి (తెలుగు) – 12.00, 3.10, 6.20, 9.30
స్క్రీన్-3 –	భీమా (తెలుగు) – 12.30, 3.35, 6.40, 9.45